మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి
గురువారం 30 మే 2024
పేజీలు 8



- తూతూ మంత్రంగా పరిశీలించి చేతులు దులుపుకున్న వైనం
- రెచ్చిపోతున్న రియల్ మాఫియా
- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అధికారుల తీరు పట్ల సార్వత్ర విమర్శలు

# అక్రమ వెంచర్లకు అధికారులే అండ!

**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** కల్వకుర్తి మున్సిపాలిటీ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లకు అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయని చెప్పవచ్చు. అక్రమాలకు పాల్పడే కొందరు రియల్ వ్యాపారులు గత ప్రభుత్వంలో అధికారుల అండదండలతో ధనార్జనే లక్ష్యంగా అక్రమ వెంచర్లకు తెరలేపి అందిన కాడికి దోచుకున్న విషయం తెలిసిందే, ఆ అక్రమ వెంచర్లకు వంత పాడుతున్న ఇప్పుడు ఉన్న అధికారుల తీరు పట్ల సర్వత్ర విమర్శలు గుప్పిస్తున్నాయి, అక్రమ వెంచర్లని తెలిసిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు, అక్రమాలకు పాల్పడే రియల్ వ్యాపారులు తమ అక్రమాలు బయట పెట్టొద్దని

మిగతా 2లో







# రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేయాలి

## ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లడం జరుగుతుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సింగిల్ విండోలు రైతు సంక్షేమానికి అనుగుణంగా పనిచేయా లని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి కోరారు. బుధవారం నియోజకవర్గంలోని తాడూరు సింగిల్ విండో చైర్మన్ గా రాంచంద్రారెడ్డిని నియమిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతు సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని, నూతన చైర్మన్ రైతుల పక్షపాతిగా పనిచేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రోహిణి గోవర్ధన్ రెడ్డి ఎంపీటీసీ రేణుక ముఖ్య నాయకులు భగవంతు రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు



# రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు

## - జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**గద్వాల ప్రతినిధి, మేజర్‌న్యూస్:** వర్షాకాలం ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వర్షాకాలంలో అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, 650 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. ఇప్పటివరకు 381.9 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేశామన్నారు. 91.8 క్వింటాళ్ల జీలుగా అందుబాటులో ఉన్నాయని, ఇంకా 268.1 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేస్తున్నమన్నారు. అదేవిధంగా రైతులకు కావాల్సిన పచ్చి రొట్టె ఎరువులు అందుబాటులో ఉంచామని రైతులెవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పత్తి రైతులు బీటీ -2 హైబ్రిడ్ విత్తనాలు ఒకే విధంగా పనిచేస్తాయని, ఒకే రకమైన కంపెనీ విత్తనాలు కాకుండా అందుబాటులో ఉన్న ఏ రకమైన కంపెనీ విత్తనాలైనా కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయవద్దని, ఆయా కంపెనీ లేబుల్ కలిగిన ప్యాకెట్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లను మరియు బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

# ప్రభుత్వ లక్ష్యాన్ని పకడ్బందీగా నెరవేర్చాలి

## - అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్





**పానగల్ మేజర్‌న్యూస్:** ప్రభుత్వ బడుల బలోపేతం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో ప్రారంభించిన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ఆదేశించారు. బుధవారం ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికై దావాజ్ పల్లి దొండాయిపల్లి రాయిని పల్లి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రభుత్వ బడులను అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించిందని కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలన్నారు. దావాజీ పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అంగన్వాడీ పరిధిలోని చిన్నారులు బాలింతలు గర్భవతులకు ప్రభుత్వం ద్వారా వస్తున్న పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్వాడి కార్యకర్తకు ఆదేశించారు, గ్రామానికి కలెక్టర్ వస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని కోడ్ ముగిసిన తర్వాత సమస్యల పరిష్కారం త్వరితగతిన చేపడుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన ఆశా కార్యకర్తలతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి ఎంత మంది గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు, ప్రజల ఆరోగ్యం పై పరిసరాల పరిశుభ్రత పై

మిగతా 2లో

## ప్రభుత్వ లక్ష్యాన్ని పకడ్బందీగా నెరవేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు, పాఠశాల ముందుగా వెళ్తున్న ఇద్దరు చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన జిల్లా కలెక్టర్ వారితో కొద్దిసేపు ముచ్చటించి ఇద్దరు చిన్నారులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ చెన్నయ్య, వ్యవసాయ శాఖ ఏడి చంద్రశేఖర్, ఎంపీడీఓ కోటేశ్వర్, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక, డిప్యూటీ తహసిల్దార్ అశోక్, సర్వ శిక్ష అభియాన్ ఏఈ కవి రెడ్డి, ఏపీఓ కుర్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**మదనాపురం,మేజర్ న్యూస్:** వనపర్తి జిల్లా మదనపురం మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన 1994- 95 బ్యాచ్ జడ్పిహెచ్ఎస్ హై స్కూల్ లో పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కలుసుకొని విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులను ఉద్దేశించి గురువులు మాట్లాడుతూ... విద్యార్థులు ఎదిగిన నాడు ఉపాధ్యాయులకు తృప్తి ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెల్లం సాయిలు, కురుమన్న, పుష్పలత, తిరుమలయ్య, చింతలయ్య ,పూర్వ విద్యార్థులు భాగ్యలక్ష్మి, కౌసత్ బేగం, సునీత, అరుణ, సరళ, ఏఎంపి నాగరాజు, చుక్కల మల్లేష్, మహేందర్, విమల్ కుమార్, మాసన్న, మొగలన్నతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో అక్రమ ఇసుక మట్టి రవాణా

### - అధికారుల అండతో యదేచ్చగా అక్రమ ఫిల్టర్ ఇసుక దందా



**లింగాల, మేజర్‌న్యూస్:** సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీల కార్యకలాపాలపై పర్యవేక్షణ కరువై గ్రామపంచాయతీ సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా సాగుతున్నది. ముఖ్యంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను పంచాయతీ సిబ్బంది సొంత అవసరాలు వినియోగిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారుల అండతో యదేచ్చగా అక్రమ ఫిల్టర్ ఇసుక దందా నడుస్తున్నదని అందులో భాగంగా గత కొన్ని రోజులుగా ధారారం గ్రామపంచాయతీ ట్రాక్టర్ను వినియోగిస్తున్నారని ధారారం గ్రామస్తులు, యువకులు ఆరోపిస్తున్నారు. దారారం గ్రామపంచాయతీ కార్యదర్శి అండతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తో ఇసుక మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు వస్తుండడంతో కొంతమంది యువకులు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మాటు వేసి ధారారం గ్రామపంచాయతీ టాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక మట్టి ట్రాక్టర్ ను వెంబడించి పట్టుకున్నారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ రాముడు ప్రశ్నించగా పంచాయతీ కార్యదర్శి బాలమణి ఆదేశాల మేరకే ఇసుక మట్టిని తరలిస్తున్నట్లు బదులిచ్చాడని యువకులు తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేయడమే నేరమైతే నాసిరకం ఫిల్టర్ ఇసుక తయారీకి ఉపయోగించే ఇసుక మట్టి గ్రామపంచాయతీ ట్రాక్టర్లలో తరలించడం తమ బాధ్యత రహిత్యాన్ని సూచిస్తున్నారని యువకులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడుతూ ఈ సంఘటన పాల్పడిన వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని యువకులు గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీడీవో ఆంజనేయులు వివరణ కోరగా కంపోస్టు ఎరువుల తయారీకి మట్టి తీసుకొస్తున్నట్లు గ్రామ కార్యదర్శి చెప్పారని తెలిపారు. కానీ అర్ధరాత్రి వేళ మట్టి ఎందుకు తరలించాల్సి వచ్చిందో విచారణ జరిపి తగు చర్యలు తగు చర్యలు చేపడతున్నట్లు తెలిపారు.

## అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

**నవాబ్ పేట మేజర్ న్యూస్ :** అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నీర్సాబ్ తాండా లో చోటు చేసుకుంది.సఘటన వివరాలు ఇలా ఉన్నాయి చౌడాపూర్ మండల పరిధిలోని చాకలి పల్లి గ్రామానికి సమీపంలో ఉన్న నీర్సాబ్ తాండా కు చెందిన కాట్రావత్ రవి బుదవారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో తన ఇంటి బయట ఉన్న బాత్రూం లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ విషయం పై అతని భార్య కాట్రావత్ నీలమ్మ భర్త ఆత్మహత్య చేసుకున్న విషయం పై ఆమె భర్త అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు అని దర్యాప్తు చేయాలని నవాబ్ పేట ఎస్సై అభిషేక్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

## అక్రమ వెంచర్లకు అధికారులే అండ ..!

(మొదటి పేజీ తరువాయి)



కొంతమంది అధికారులకు కలిసినట్టు తెలిసింది, పత్రికల్లో వస్తున్న కథనాలను చూసి తూతూ మంత్రంగా పరిశీలించి అధికారులు చేతులు దులుపుకున్నారు, అధికారుల అండదండలు ఉండడంతో అక్రమాలకు పాల్పడే రియల్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు, అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు నష్టపోతున్నారు, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు దారితీస్తుంది, అధికార తీరు పట్ల పట్టణ ప్రజలు సార్వత్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

● మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 54/ ఏ వెంచర్‌లో మున్సిపాలిటీకి సంబంధించిన 1400 గజాల స్థలాన్ని బీఆర్ఎస్ నేత, ఓ కౌన్సిలర్ భర్త ప్లాట్లుగా చేసి ఆక్రమించుకున్నారు, ఆ వెంచర్ పై మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి చేతులు దులుపుకున్న విషయం అందరికీ తెలిసిందే, ఆ వెంచర్ స్థలాన్ని మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు గుర్తుంచకపోవడం, స్వాధీనపర్చుకోలేకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి, ఈ విషయంపై సూర్యప్రతినిధి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ టౌన్ ప్లానర్ కు చరవాణిలో సంప్రదించిన, కలిసి మాట్లాడిన పొంతనలేని సమాధానం చెబుతూ దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు, దీన్ని బట్టి చూస్తే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది. కల్వకుర్తి మండల పరిధి లోని తాండ్ర శివారులో సర్వేనెంబర్ 342, 343, 344, 345, 346లో 20 ఎకరాల్లో సింగపూర్ పేరిట ఏర్పాటు చేసిన వెంచర్ పై ఎంపీ ఓ దేవేందర్, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తో కలిసి నామ్ కే వాస్తిగా పరిశీలించి, ఎక్కడ వేసిన గొంగడి అన్నచందంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం, అదేవిధంగా కుర్మిద్ద శివారులో సర్వేనెంబర్ లో గల 33,34,35,36,37 వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన సింగపూర్ వెంచర్ల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది, ఆ వెంచర్లలో జీపి కి ఇవ్వాల్సిన భూమిని కొందరు అక్రమార్కులు మాయం చేసినట్లు తెలిసింది, అదే శివారులో గల సర్వేనెంబర్ 25,26,27 లో సింగపూర్ పేరిట ఏర్పాటు చేసిన 30 ఎకరాల వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా చేసి స్కీం ద్వారా విక్రయిస్తున్నారు, ఆ ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తుంది, పత్రికల్లో వస్తున్న కథనాలను చూసి డిఎల్‌పిఓ శ్యాంసుందర్, ఎంపీ ఓ దేవేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తో కలిసి వెంచర్ ను పరిశీలించిన విషయం అందరికీ తెలిసిందే, ఆ వెంచర్ అక్రమ వెంచర్ అని అధికారులు గుర్తించినప్పటికీ ఇప్పటివరకు ఆ వెంచర్ పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల పనితీరు ఎలా ఉందో తెలుస్తుంది, అక్రమ వెంచర్ల ను కట్టడి చేయాల్సిన అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి, అదేవిధంగా జెపి నగర్ తండాలోని సర్వేనెంబర్ 340, 341 లో రెండు ఎకరాల 5 గుంటలలో ఏర్పాటు చేసిన వెంచర్ లో నక్ష బాట ఉందని సూర్య ప్రతినిధి కల్వకుర్తి తహసిల్దార్ దృష్టికి తీసుకువెపోయినప్పటికీ సర్వే చేయించి గుర్తిస్తామన్న తహసిల్దార్ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అక్రమ వెంచర్లకు అండగా నిలుస్తున్న కొందరి అధికారుల తీరు పట్ల ఉన్నతాధికారులుదృష్టిసారించిచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రేణుక ఎల్లమ్మ బండారు వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

### - నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి





**నర్వ మేజర్ న్యూస్:** మండల కేంద్రంలో బుధవారం రేణుక ఎల్లమ్మ దేవత బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి కయా కర్పూర హారతులతో మొక్కలు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అమ్మవారికి పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. బైండ్ల వల్ల పాటలను ఆటలను చూసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తిలకించి సంతోషించారు. అదేవిధంగా ఎల్లమ్మ బండారు వేడుకలలో ముఖ్య అతిథులుగా నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ గౌడ్, నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, నర్వ మండల ఉపాధ్యక్షులు శరణప్ప, ప్రధాన కార్యదర్శి వివేకవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలి : సీఎం రేవంత్ రెడ్డి కి టీజీజేఎల్ఎ వినతి





**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** ఇంటర్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ ను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల-475) రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆన్లైన్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. 2024 ఫిబ్రవరి ప్రాక్టికల్స్, థియరి మార్చిలో ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగాయి. కానీ ఇంత వరకు పరీక్ష విధుల్లో పాల్గొన్న, ప్రభుత్వ అధ్యాపకులు, ప్రయివేటు అధ్యాపకులు, ఇన్విజిలేటర్స్ గా పనిచేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలో పనిచేస్తున్న వారు, స్వీపర్లు, వాటర్ బాయ్స్, అటెండర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండేండ్ల క్రితం వార్షిక పరీక్షల విధులు నిర్వహించిన వారికి వెంటనే చివరి రోజు రెమ్యూనరేషన్ చెల్లించేవారని గుర్తు చేశారు. రెండేండ్ల నుంచి రెమ్యూనరేషన్ ఇవ్వడం ఆన్లైన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఐదారు నెలల వరకు రెమ్యూనరేషన్ ను పరీక్ష విధులు నిర్వహించిన వారికి చెల్లించడం లేదని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శిని పలుమార్లు కలిసి వినతిపత్రాలు మా సంఘం 475 తరపునుండి సమర్పించామని తెలిపారు. ఇంత వరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు . మే 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. కానీ సకాలంలో రెమ్యూనరేషన్ ను చెల్లించడంలో ఇంటర్ బోర్డు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని రెమ్యూనరేషన్ ను వెంటనే ఈనెల 31 వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అధికారులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలు ఇంటర్ వార్షిక పరీక్షల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ వచ్చేనెల జూన్ ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలను నిర్వహిస్తామని వనపర్తి జిల్లా టి జి జె ఎల్ ఏ 475 అధ్యక్షులు సి కృష్ణయ్య , కార్యదర్శులు వెంకట్ రెడ్డి తెలిపారు. పెండింగ్లో ఉన్న రెమ్యూనరేషన్ ను వెంటనే చెల్లించాలని కోరారు.

## వృత్తితో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి : విద్యుత్ శాఖ ఎస్ఇ రమేష్



**పాలమూరు మేజర్ న్యూస్ :** ఉద్యోగులు తమ వృత్తి తో పాటు ఆరోగ్యం పట్ల తగినంత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని మహబూబ్నగర్ విద్యుత్ శాఖ ఎస్ ఈ పీవీ రమేష్ అన్నారు. బుధవారం యశోద ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో మహబూబ్నగర్ విద్యుత్ శాఖ భవనంలో ఏర్పాటుచేసిన మెగా హెల్త్ క్యాంప్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధుల పట్ల శ్రద్ధ చూపించగలమన్నారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న యశోద ఆసుపత్రి బృందాన్ని అభినందించారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న 183 మంది ఉద్యోగులు సిబ్బందికి బిపి, షుగర్, ఈసీజీ, 2డిఈకో, పిఎఫ్టి, బిఎండి, ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక సమస్యలు ఉన్న 21 మందిని గుర్తించారు. ఆయా సమస్యలు ఉన్నవారికి అవసరమైన మందులు, పరీక్షలు రాయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య బృందం వివరించారు. కార్యక్రమంలో డీఈటీ చంద్రమౌళి, ఎస్ఏఓ బీచుపల్లి, ఏవో గోపికృష్ణ ఏఏఓ గంగాధర్, పి ఓ శివగణేష్ రావు, విజయ్ కుమార్, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గొర్లకు గడ్డి రోగం టీకాలు వేయించాలి

### - జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా,జే.వి.రమేష్



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** జిల్లాలో తొలకరి జల్లులు కురుస్తున్నందున మొలకెత్తిన పచ్చ గడ్డి తిని గొర్లు రోగాల బారిన పడకుండా ముందుగానే గడ్డి టీకాలు వేయించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా పశు సంహోర్ధక శాఖ అధికారి డా,జే.వి.రమేష్ తెలిపారు. ఆయన బుధవారం ఉదయందే శిటిక్యల్ గ్రామంలోని పశు వైద్యశాల సబ్ సెంటర్ లో నిర్వహిస్తున్న గడ్డి టీకా క్యాంప్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి పశువులను తీసుకు వచ్చిన రైతులతో మాట్లాడారు పశువులకు ఎలాంటి వ్యాధులు వచ్చాయని వాటికి సిబ్బంది వైద్యం అందిస్తున్నారని తెలుసుకుని రైతులు కూడా ఎలాంటి ముందస్తు చర్యలు చెప్పట్టలో సూచించారు. అనంతరం మందుల ఎక్సపెయిరి తేదీలను,ఎల్ న్ట కంటైనర్, పలు రికార్డులను పరిశీలించారు

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

### - ఎస్సై జగన్మోహన్



**లింగాల, మేజర్‌న్యూస్:** ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్సై జగన్మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం లింగాలలో యువత ఆధ్వర్యంలో జిల్లా బ్లడ్ బ్యాంక్ ప్రభుత్వ జనరల్ దవఖానచే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కెల్లా రక్త దానమే మహా దానమని అన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా



సామాజిక సేవలో యువత ముందుండాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధికి నోచుకోని దేశం పురోభివృద్ధి చెందుతుంది అన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రక్తదానంపై ఉన్న మూఢ విశ్వసాలను వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. అపోహలకు తావు లేకుండా రక్త దానం చేస్తూ సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. రక్తదానంచేయడానికి ముందుకు వచ్చిన యువతకు అభినందించారు.ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, రాజు, బళ్లారి నరేష్, పూజారి వెంకటయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం : మాజీ సర్పంచ్



**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని జిల్లెల్ల గ్రామంలో ఇటీవల వికలాంగుల సంఘం నేత పెరుమాళ్ల కృష్ణ మృతి చెందారు. బుధవారం మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలనే లక్ష్యంతో నలబైవేల రూపాయల ఆర్థిక సాయం అందించారు, అదేవిదంగా గ్రామ నాయకులు మరో ముప్పైవేల రూపాయలు మృతుని భార్య అలివేల, కూతురు నిత్యకు అందజేశారు, గ్రామంలోని పేద ప్రజలకు ఏ ఆపద వచ్చిన తనవంతుగా సహాయం చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ జిల్లేల రాములు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో వీరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, గుమ్మకొండ బాల్ జంగయ్య, మహేంద్రం, కృష్ణ, మోక్తాల బాల్ జంగయ్య, యాదయ్య, దార పాండు, ప్రభాకర్, డొక్కా జంగయ్య, వినయ్, వెంకటయ్య, రాజు, పెద్ద యాదయ్య, సుల్తాన్, రమేష్, పవన్, రాములు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

# తక్షణమే బీసీ కులాల గణన చేపట్టాలి..

## - సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేసిన బిసిసేన రాష్ట్ర అధ్యక్షులు



**నారాయణపేట టౌన్, మేజర్‌న్యూస్:** ఆరు నెలల లోపు బీసీ కులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు ముగుస్తున్న బీసీ కులాల గణన, చేపట్టకపోగా, సకాలంలో నిర్వహించాల్సిన సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయడం వల్ల గ్రామాలలో అభివృద్ధి కుంటుపడుతుందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని బుధవారం నారాయణ పేట కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ బాల్ చందర్ కు మెమోరాండం అందజేసిన బీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్ అనంతరం బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒకేరోజులో సకలజనుల సర్వే నిర్వహించి సబండావర్గాల ప్రజల సంపూర్ణ సమాచారాన్ని, సేకరించిందని తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారం గడువు లోపల రాష్ట్రంలోని బీసీల జనాభా గల సంపూర్ణంగా చేపట్టవచ్చు అని, ఆలస్యం చేయడం కేవలం రాజకీయ కారణమేనని, తక్షణమే ముఖ్యమంత్రి, బీసీ కులాల ఘనంగా చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, లేని యెడల బిసి సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా కన్వీనర్, వీరేష్, జిల్లా కార్యదర్శి అంజనేయులు యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు కురుమయ్య, నియోజకవర్గం ఉపాధ్యక్షులు గణేష్, ఆంజినేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### - బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దేగ అనిల్ కుమార్



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దేగ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30% ఫీజులను యాజమాన్యాలు పెంచుతూ వెళ్తున్నాయన్నారు, అడ్మిషన్ ఫీజు పుస్తకాలు విద్యాసామగ్రిని కొనుగోలు చెయ్యడం విద్యా హక్కు చట్టం ప్రకారం నేరం కానీ దానికి విరుద్ధంగా ఇష్టం వచ్చినట్లుగా ఎవరికి వారు యమునా తీరు అన్నటుగా నియమాలు పెట్టుకొని సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు పెను బారంగా మారి వారి పిల్లల చదువులపై బారం పడుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యా సంవత్సరం ప్రారంభ కాక ముందే అధిక ఫీజులు వసూలు చేసే వాటిపై కటిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రమాదాల నివారణ కొరకు అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచలేకపోతున్నారు, 2009 విద్యకు చట్టం ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలి కానీ ఇవేవీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాలన్నారు, రాష్ట్రంలో విద్యారంగం వ్యాపార వస్తువుగా మారిందని విద్యాహక్కు చట్టం అమలు చేసి ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని కోరారు

## ఇంటర్ మూల్యాంకణంలో తప్పులు చేసిన అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి

### - బహుజన విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** ఇంటర్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్ బోర్డ్ ప్రశ్న పత్రాల వాల్యుయేషన్ చేసిన అధ్యాపకుల నిర్లక్ష్యం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని, నిర్లక్ష్యం వహించిన అధ్యాపకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంవత్సరం పొడవునా ఎంతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని పరీక్షలు రాస్తే, అధ్యాపకులు నిర్లక్ష్య ధోరణితో మూల్యాంకనం చేయడం వల్ల ఎంతోమంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. మెరిట్ స్టూడెంట్ విద్యార్థికి మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కుల కు ద్వితీయ సంవత్సరంలో వచ్చిన మార్కులకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 100కు 98, 99 మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో వచ్చిన మార్కులను చూసి ఎంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. సరిగ్గా జవాబు పత్రాలు పరిశీలించకుండానే ఎన్ని తోస్తే అన్నిమార్కులు వేయడం. మొత్తం మార్కుల కూడికలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత సుమారుగా 48 వేల మంది విద్యార్థులు పున పరిశీలనకు, మరో రెండు వేల మంది విద్యార్థులు పునలెక్కింపునకు దరఖాస్తులు చేసుకున్నారు. కొన్ని కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు పేపర్ల మూల్యాం కనానికి ట్యూటర్లను, జూనియర్ అధ్యాపకులను పంపడమే దీనికి కారణమని అన్నారు . 2019 సంవత్సరంలో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అయినప్పటికీ ఇంటర్ బోర్డు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి పెట్టకపోవడం చాలా బాధాకరం అని అన్నారు. మార్కులు తేడా వస్తే జరిమానవేసి చేతులు దులుపుకోవడమే తప్ప తప్పు చేసిన అధ్యాపకులను గుర్తించి వారి కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు పంపి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు . మళ్లీ ఇలాంటి సమస్యలు పునరావృతమైతే అన్ని విద్యార్థి, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : బిఏడిఏ రమావత్ రవి





**చారకొండ మేజర్ న్యూస్ :** ఏడిఏ రమావత్ రవి, ఏవో చిన్న హుస్సేన్ యాదవ్ మండలంలో ఫర్టిలైజర్ డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడిఏ రమావత్ రవి ఏవో చిన్న హుస్సేన్ యాదవ్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో చిన్న హుస్సేన్ యాదవ్‌తో కలిసి ఏడిఏ రమావత్ రవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం ప్రారంభం కావడంతో రైతులకు నాణ్యతమైన విత్తనాలు విక్రయించాలని నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వారికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్ లోని నోటీస్ బోర్డులో నమోదు చేయాలని అన్నారు గ్రామాల్లో ఎవరన్నా నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. వారి వెంట ఏ ఈ వోలు రేణుక వంశీ ఫర్టిలైజర్ డీలర్లు ఉన్నారు.

## పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు 100% యూనిఫారాలు అందజేయాలి

### - లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



**బిజినాపల్లి మేజర్‌న్యూస్:** యుద్ధ ప్రాతిపదికన విద్యార్థుల యూనిఫారాల కుట్టడాలను పూర్తిచేసి పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు 100% యూనిఫారాలు అందజేయాలని లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ ఆదేశించారు బుధవారం మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్లో విద్యార్థుల యూనిఫారాల కొట్టడాన్ని ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఇంద్రకాంతి పథకం ఏపీఎం రజితను అడిగి తెలుసుకున్నారు మొత్తం 5411 యూనిఫారాలకు గాను 2000 యూనిఫారాలు కుట్టడం పూర్తి చేశామని ఆమె కలెక్టర్కు తెలిపారు త్వరగా యూనిఫారాలు కుట్టడం పూర్తిచేసి విద్యార్థులకు డ్రస్సులు అందజేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప ఎంపీ ఓ రాములు నాయక్ సీసీలు తదితరులు పాల్గొన్నారు

## ఇయర్ వైజ్ బ్యాక్ లాగ్‌ఎగ్జామ్ ఫీజును తగ్గించండి

### - పాలమూరు జిల్లా ఎ బివిపి కన్వీనర్ సతీష్




**మహబూబ్‌నగర్ మేజర్‌న్యూస్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఇయర్ వైజ్ పరీక్ష ఫీజు తగ్గించాలని పాలమూరు యూనివర్సిటీ ఓఎస్డీ మధుసూదన్ రెడ్డికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 2010 నుండి 2016 వరకుచదివి ఫెయిల్ అయిన డిగ్రీ విద్యార్థులకు పాలమూరు యూనివర్సిటీ వన్ టైం ఛాన్స్ ఇస్తూ పరీక్ష ఫీజును విడుదల చేసి ఒక సబ్జెక్టు పేపర్‌కు రూ 5000/- రుసుము పరీక్షకు అవకాశం ఇవ్వడం జరిగింది. ఇది విద్యార్థులకు మోయలేని భారంగా మారింది. అధిక మొత్తంలో ఫీజు నిర్ణయం చేయడం కారణంగా విద్యార్థులపై తీవ్ర భారం పడుతుంది కావున పెంచిన ఫీజును వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీ కూడా వన్ టైం ఛాన్స్ పరీక్ష రుసుము 8000/-నుంచి 10000/-రూపాయలు నిర్ణయం చేసింది. ఇది ఇబ్బంది కరంగా ఉండటం వల్ల విద్యార్థులు ఈ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని పరీక్ష ఫీజును 2000/- తగ్గించింది, కాబట్టి పాలమూరు యూనివర్సిటీ అధికారులు కూడా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పరీక్ష ఫీజును తగ్గించాలని జిల్లా కన్వీనర్ సతీశ్ డిమాండ్ చేశారు. దీని కారణంగా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులుఈఅవకాశాన్నివినియోగించుకుంటారనితెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యుడు శివ, వరుణ్, అరుణ్, కార్తీక్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**వెల్దండ మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన రఘు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న. బీఆర్ఎస్ నాయకులు ఎంపి టిసి గుత్తి వెంకటయ్య .పర్వతాలు. రాజు మృతుని కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం.తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ 3 వేల రూపాయలు ఎంపిటిసి గుత్తి వెంకటయ్య 2 వేల రూపా యలు. మాజీ వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్ 2 వేల రూపాయలు. మృతుడు రఘు కుటుం బానికి బుధవారం అందజేశారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో. చిన్నయ్య జంగయ్య. వెంకటేష్ తదితరులు ఉన్నారు

# విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

### - ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత బి. గోపాలం



**మాగనూరు మేజర్ న్యూస్ :** ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పిఈటి బి .గోపాలం 20 మంది విద్యార్థులకు 5వేల విలువచేసే క్రీడా దుస్తులను అందించినట్లు పాఠశాల ఉపాధ్యాయురాలు బి.దీప బుధవారము విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా బి.గోపాలము మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయురాలు డి.దీప విద్యార్థుల కొరకు క్రీడా దుస్తులను అడిగినందుకు విద్యార్థులను క్రీడల వైపు మళ్లించుటకు క్రీడా దుస్తులను అందజేసినట్లు, ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి నిర్బంధ వ్యాయామవిద్యను ప్రభుత్వము ప్రవేశపెట్టినట్ల యితే, చిన్నతనంలోని విద్యార్థులు క్రీడలలో రాణిస్తారని, గ్రామీణ ప్రాంతాలలో స్టామినా కలిగిన క్రీడా ఆణిముత్యాలను వెలికి తీయవచ్చునని, హైదరాబాద్ హకీంపేట క్రీడా పాఠశాల కొరకు విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ తరఫున పాఠశాలలు తెరిచిన తర్వాత ఉచితంగా కోచింగ్ ఇస్తామని బి.గోపాలం తెలిపారు. విద్యార్థులు చిన్నతనము నుండి చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని బి గోపాలం తెలిపారు. బి. దీప విద్యార్థి దశలో జాతీయస్థాయిలో ఖో ఖో ఆడి వెండి పథకం సాధించిందని, క్రీడాకారిణిగా తమ పాఠశాల విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించుటకు సహకారం అందించాలని దీప కోరిందని, గత సంవత్సరము పాఠశాల విద్యార్థిని క్రీడా పాఠశాలకు దీప పంపడం జరిగిందని, క్రీడాకారులకు నా వంతు పూర్తి సహకారం అందిస్తానని బి.గోపాలం తెలిపారు. పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేసిన బి.గోపాలముకు ఉపాధ్యాయురాలు దీప కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కామ్రేడ్ బూసి రామచంద్రారెడ్డి గ్రామములో 15వ వర్ధంతి సభ



**అచ్చంపేట మేజర్ న్యూస్:** అచ్చంపేట మండలం ఐనోల్ గ్రామానికి చెందిన కామ్రేడ్ బూసి రామచంద్రారెడ్డి15వ వర్ధంతి సభను సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు లింగారెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు మణిపాల్ రెడ్డి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. గ్రామస్తులు పూలతో ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ రామచంద్రారెడ్డి గొప్ప భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదల కోసం పనిచేయడానికి సిపిఎం పార్టీని ఈ ప్రాంతంలో గ్రామ గ్రామాన ఎర్రజెండాలు ఎగిరేయడానికి ముందుకు వచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు రామచంద్రారెడ్డి బతికిన కాలంలో గ్రామంలో సంపత్తి భోజనాలు ఏర్పాటు చేసి ఎక్కువ తక్కువలు లేకుండా అందరూ కలిసి భోజనం చేసే వాళ్ళు అని అన్నారు. రామచంద్రారెడ్డి నక్సలైట్లు వచ్చి బెదిరించిన భయపడని గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంతంలో సిపిఎం పార్టీ నాయకులను అంతయ్య రహీం, సుధాకర్ రెడ్డి ,కొట్టే నిరంజన్, వీళ్ళందర్నీ కూడా నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారని అన్నారు. రామచంద్రారెడ్డి బ్రతికినంత కాలం పేదల కోసమే బ్రతికినాడని, ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాలు ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రం మరో పార్టీకి మారుతున్నారు. కానీ రామచంద్రారెడ్డి తన 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎర్రజెండా వారసత్వాన్ని కొనసాగించినాడని అన్నారు. అయినవోలు గ్రామంలో పేదలకు భూములు పంచినటువంటి నాయకుడని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిని తిండి పైన కట్టే బట్టల పైన ఆంక్షలు విధిస్తున్నారు పేదల పైన అనేక భారాలు మోతి ధరలను విపరీతంగా పెంచుతున్నారని అన్నారు. పెట్రోలు డీజిల్ ధరలు ఫలితంగా పెంచడం జరిగిందని, మనం తాగే పాలు పెరుగు మీద కూడా జీఎస్టీ విధించే బారాలు మోపడం జరిగిందని అన్నారు. రాబోయే కాలంలో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్యాజ్ వెంకటయ్య, బుల్లు చిన్నయ్య, హెంమ్లా నాయక్ గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల





**అడ్డాకుల మేజర్ న్యూస్ :** అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన, అడ్డాకుల మండల కో ఆప్షన్ మెంబర్ ఖజా ఘోరి తండ్రి బషీర్ ఘోరీ (82) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషయం తెలుసుకొన్న, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు బషీర్ గోరి పార్థివ దేహాన్ని సందర్శించి, పుష్ప గుచ్చా ముంచి నివాళులు అర్పించారు. అదేవిధంగా దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్ ఆదేశాల మేరకు, జిఎంఆర్ స్వయానా సోదరుడు జి.భాస్కర్ రెడ్డి, బుధవారం స్థానిక నాయకులతో కలసి అడ్డాకుల లో బషిర్ ఘోరి పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అడ్డాలో జెడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, జిఎంర్ సోదరుడు జి.భాస్కర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగుల విజయ్ మోహన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ కందూర్ నాగిరెడ్డి, అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, రాచాల కె పి ఆర్ గౌడ్, అడ్డాకుల మండల యూత్ అధ్యక్షుడు శరత్ కుమార్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, చక్రపాణి రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గోవుల బాలరాజు, మహేష్ యాదవ్, తదితరులు పాలుగోన్నారు. అనంతరం రాచాల గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహేష్ ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి భౌతిక దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జిఎంర్, సోదరుడు జి.భాస్కర్ రెడ్డి. అతని వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు.

## మాధవరం గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవం



**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండలం మాధ వరం గ్రామంలో ఎల్లమ్మ బండారు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామంలోని బుడినమనోల గోత్రం వారు మూడు రోజులపాటు ఎల్లమ్మ ద్యావర్లు నిర్వహించారు. సోమవారం నుంచి నిర్వహించిన ఎల్లమ్మ బండారు ఉత్సవాలు చివరి రోజైన బుధవారం గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం దగ్గర బుడినమనోల గోత్రం కులస్తులపై ఆడపడుచులు, బంధువులు, స్నేహితులు హాజరై బండారును వారిపై చల్లారు. అనంతరం విందు భోజనాలు ఆరగించారు. బిజరం వెంకటన్న, పెద్ద హనుమంతు, ఉప్పు శ్రీను, చిన్న బాలస్వామి, బి.నరసింహ, శివరాజ్, కొత్త బుగ్గన, రామాంజనేయులు, రాయమోళ్ళ రవి, రాజేష్, ఆంజనేయులు, ఉప్పు చంద్రప్ప, రాములు, రాము పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతయ్య.



**గద్వాల మేజర్ న్యూస్ :** గద్వాల పట్టణం, 34 వ వార్డ్ చిన్న అగ్రహారంలో అనారోగ్యం తొ మృతి చెందిన మలే నరసింహాయ్య పార్థి వ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతయ్య, వారితో పాటు నాగేందర్ యాదవ్, మధుసూధన్ బాబు, వెంకట్రాంరెడ్డి, రాము యాదవ్, మోహన్ యాదవ్, కుమారి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అచ్చంపేట జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులుగా బండారు శ్రీనివాసులు ఎన్నిక




**అచ్చంపేట అర్బన్ మేజర్‌న్యూస్:** అచ్చంపేట జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులుగా బండారు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి భాగ్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు అచ్చంపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం జిల్లా కో ఆపరేటివ్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి భాగ్యమ్మ ఆధ్వర్యంలో ముందుగా 11 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా బండారు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కాలురి శ్రీనివాసులు, కోశాధికారిగా దుమార్ల భాస్కర్, ఉపాధ్యక్షులుగా బాణల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు కో ఆపరేటివ్ జూనియర్ ఇనస్పెక్టర్స్ మహమ్మద్ కుతుబుద్దీన్, పి సబిత అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి,భాగ్యమ్మకు సహకరించారు. అచ్చంపేట జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధ్యక్షులు బండారు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు అదే విధంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నకిలీ విత్తనాల సరఫరా, క్రయ, విక్రయాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- గ్రామాలలో నకిలీ విత్తనాలు అమ్మీ రైతులను మోసం చేసే వారి పై పటిష్ట నిఘా, కఠిన చర్యలు
- నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ రితిరాజ్, ఐపీఎస్



**గద్వాల మేజర్ న్యూస్ :** గద్వాల్ జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, ఉత్పతి, విక్రయాలు జరిపి రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నకిలీ సీడ్స్ అమ్మే వారి పట్ల రైతులు మోసపోకు%శీ%డ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రితిరాజ్, తెలిపారు. ఆరుగాలం కష్టించి పని చేసే రైతులు మోసపోకుండా ఉండేందుకు జిల్లాలో నకిలీ సీడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో గతం లో నమోదు అయిన నకిలీ విత్తనాల కేసుల వివరాలను పరిశీలించారు. ఆయా కేసులలో ఉన్న నిందితుల పై పోలీస్ అధికారులు నిఘా ఉంచాలని, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు, ఎలా జీవనం కొనసాగిస్తున్నారు వంటి వివరాలు తెలుసుకొని నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కేసులలో సాక్ష్యాధారాలు సేకరించడంతో పాటు ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్, ఏ.ఓ రిపోర్ట్ పకడ్బందీగా సబ్మిట్ చేసి ఆయా కేసులలో నిందితులకు శిక్షలు పడేందుకు కృషి చేయలని సూచించారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. వర్ష కాలం సమీపిస్తున్న వేళ గ్రామాలలో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని, ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలలో విపిఓల ద్వారా నిఘా పటిష్ఠం చెయ్యాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో నకిలీ విత్తనాలు జిల్లాలోకి రావడం గాని, జిల్లా నుండి బయటకు వెళ్లడం జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, విత్తనాలు అమ్మే షాపులు లలో నిఘా ఉంచి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలనీ, లూస్ విత్తనాలను కొనవద్దని, గుర్తింపు పొందిన కంపనీ డీలర్ల వద్ద మాత్రమే సీడ్స్ ను తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎవరైన తక్కువకు విత్తనాలు వస్తాయ%శీ%టే కొని మోసపోవద్దు అని, జర్మినేషన్ టెస్ట్‌లో ఫెయిల్ అయిన విత్తనాలను విక్రయించే అవకాశం ఉందని వాటిని కొని మోసపోవద్దు అని అలాగే ఇతర ప్రాంతాల నుండి గ్రామాల్లోకి వచ్చి నకిలీ లేబుల్ తో అమ్మే విత్తన ప్యాకెట్స్‌లను తీసుకోవద్దని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. జిల్లాలో ఎవరైనా నకిలీ సీడ్స్‌ను అమ్మిన, సరఫరా చేసిన, అలాంటి వారికి సహకరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అలాంటి వారి పై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించడం తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం అరెస్టు పెండింగ్ కేసుల పై, ఎన్.బిడబ్ల్యూఎస్ పెండింగ్ కేసుల పై సమీక్షించి అధికారులకు తగు సూచనలు చేశారు. కొత్త చట్టాల పై శిక్షణ తరగతులను ప్రారంభించిన జిల్లా ఎస్పీ జులై నెల నుండి అమల్లోకి రానున్న కొత్త చట్టాలు అయిన భారతీయ సాక్ష్య ఆధినియం (బిఎస్ఏ), భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) మరియు భారతీయ నాగరిక సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) చట్టాల పై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. కొత్త చట్టాల పై అవగాహన శిక్షణకు జిల్లా నుండి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో ఇతర పోలీస్ అధికరులకు అవగహన కల్పించే శిక్షణ కార్యక్రమాన్ని ఈ రోజు జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ మూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష పడేవిదంగా చేయడం,బాధితులకు న్యాయం అందించడం పైన ఎక్కువ దృష్టి సారిస్తాయని తెలిపారు.సత్వర న్యాయం అందించడం,న్యాయవ్యవస్థ మరియు న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా 'భాధితులకు న్యాయం అందించడం' పై కేంద్రీకృతం చేయబడ్డాయని తెలిపారు.ఈ మూడు కొత్త చట్టాలకు డిసెంబర్ 21,2023న పార్లమెంట్ ఆమోదం లభించిందని తెలియజేసారు.బాధితుల హక్కులను పరిరక్షించడం,నేరాల విచారణ మరియు విచారణను సమర్ధవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా అవసరమైన మెరుగులు దిద్దడం జరిగిందని ఎస్పీ తెలిపారు. క్రిమినల్ చట్టాలు కాలానుగుణంగా నవీకరించబడ్డాయని ,క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం మరియు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలగురించి ఎస్పీ క్లుప్తంగా వివరించారు.తాజా మరియు సవరించిన చట్టాలను అమల్లోకి తీసుకురావడంలో పోలీస్ శాఖ పాత్ర చాలా కీలకమని అన్నారు.కొత్త చట్టాలలో పేర్కొన్న శిక్షలు,నిబంధనల పట్ల జిల్లా పోలీస్ శాఖలో పనిచేసిన అధికారులు మరియు సిబ్బంది అందరికీ ఈ చట్టాల పట్ల శిక్షణ పొందిన అధికారులతో జిల్లా వ్యాప్తంగా దశల వారీగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.క్రమశిక్షణతో ఈ శిక్షణా తరగతులను పూర్తిచేసుకుని చట్టాల పైన పూర్తి అవగాహన కలిగియుండాలని ఎస్పీ సూచించారు. ఈ సమీక్షలో డి. ఎస్పీ సత్యనారాయణ, గద్వాల్ ఆలంపూర్, శాంతి నగర్ సి.ఐలు బీమ్ కుమార్, రవి బాబు, రత్నం, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, ఐటీ, డీసీ ఆర్బీ ఎస్సైలు పాల్గొన్నారు.

## నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : బిఎంపీడీవో ఇసాక్ హుస్సేన్





**చారకొండ మేజర్‌న్యూస్:** గ్రామాల్లో నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు టిఏ, ఎఫ్ఎ లకు ఎంపీడీవో ఇస్సాక్ హుస్సేన్ వారంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి పేర్లను జిల్లా డిఆర్డిఓ కు పంపించాలని అన్నారు. మండలానికి పది చేపల చెరువులు మంజూరు అయ్యాయని నీటి వసతి ఉన్న ఆసక్తిగల మత్స్యకారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు. గ్రామాలలోని వైకుంఠధామంలో మంచినీరు సౌకర్యానితో పాటు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని అన్నారు. 2024 - 25 సంవత్సరానికి ఇంటి పన్ను వసూలు చేయాలని ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు ఇచ్చి జులై 31 వరకు వంద శాతం ఇంటి పనులు వసూలు చేయాలని అన్నారు. గ్రామాల్లో పండ్ల తోటలు పెంచే రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి ఇరిగేషన్ షెడ్లలో వరి కంపోస్ట్ ఎరువును తయారు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ, ఏపీఓ పంచాయతీ కార్యదర్శులు, టి ఏ, ఎఫ్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం




**పాలమూరు మేజర్‌న్యూస్:** నేడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నట్టు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కురుమూర్తి తెలిపారు బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 30 1970లో బెంగాల్ రాష్ట్ర రాజధాని అయిన కోల్కతాలో సిఐటియు ఏర్పడిందన్నారు. సంఘం ఏర్పడ్డ నుండి అన్ని కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసిందన్నారు. దేశవ్యాప్తంగా 26 సార్వత్రిక సమ్మెలను నిర్వహించి పాలకవర్గాలను నిలేసి కార్మిక హక్కులను కాపాడుకుందన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో సిఐటియు జెండాలు ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రాజ్ కుమార్, భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరద గాలన్న, దస్తప్ప, భరత్, నందు, మణికంఠ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి మేజర్ న్యూస్:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పెరుమాళ్ళ కృష్ణ అనారోగ్యంతో మరణించడం జరిగింది. బుధవారం కల్వకుర్తి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు ఎముక జంగయ్య ఆధ్వర్యంలో 10వేల రూపాయల నగదును మృతుని కుటుంబానికి అందజేశారు, ఈ సందర్భంగా ఎముక జంగయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాండు గౌడ్, ముత్యాల రమేష్, గుమ్మకొండ ఆనంద్,గుమ్మ కొండా విష్ణు,గుమ్మకొండ లవ కుమార్, కొప్పుల శివ, నాప శివ సేన, గుమ్మకొండ వినయ్, గుమ్మకొండ లక్ష్మయ్య, గుమ్మ కొండా చిన్న రాములు ఉన్నారు.

## మహిత హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

### - మహిళా కడుపులోంచి 10 కేజీల కణితి తొలగింపు

### - డాక్టర్, యశోద



**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** కల్వకుర్తి పట్టణంలోని మహిత హాస్పిటల్ లో బుధవారం అరుదైన చికిత్స నిర్వహించి మహిళా కడుపులోంచి 10 కేజీల కణితిని విజయవంతంగా తొలగించారు. డాక్టర్ యశోద తెలిపిన వివరాలు జడ్చర్ల కు చెందిన ఫాతిమా (60 ) కడుపు నొప్పితో కల్వకుర్తి మహిత హాస్పిటల్ కు రావడం జరిగిందన్నారు, కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులో కణితి ఉందని గుర్తించడం జరిగిందని, ఆ కణితిని విజయవంతంగా తొలగించినట్లు తెలిపారు, ఫాతిమా ఆరోగ్యం నిలకడగా ఉందని ఎలాంటి ప్రాణ భయం లేదని వెల్లడించారు, మహిత హాస్పిటల్ ఆధ్వర్యంలో అనేక రకమైన అరుదైన శస్త్ర చికిత్సలు అతి తక్కువ ఖర్చుతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు, అనస్తియా డాక్టర్ సురేష్, సిబ్బంది మురుగన్, ప్రేమ్, ప్రశాంత్, రాము తదితరులు ఉన్నారు.

## చేయూత అందించిన మహా ఋషి ఫౌండేషన్



**పెద్దమందడి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జగత్ పల్లి గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో తోకలి అలివేల బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త కురుమూర్తి, కుమారులు శివకుమార్, శంకర్ లు ఉన్నారు. పెద్ద కుమారుడు శివ కుమార్ కు ఆరోగ్య పరిస్థితి ఏమి బాగాలేదు అతడికి రెండు రోజులకు ఒకసారి డయాలసిస్ చేయించాల్సిన పరిస్థితి .ఆస్తులు లేని కుటుంబం అనారోగ్య సమస్యలతో తల్లిని కోల్పోవడం, పెద్ద కుమారుని ఆరోగ్యం బాగాలేదని తెలుసుకున్న మహా ఋషి ఫౌండేషన్ సభ్యులకు తెలవడంతో వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి చేయూత గా రూ. 10వేలు చెక్కు అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఫౌండేషన్ సభ్యులు కొంకల వెంకటనారాయణ, ఉమ్మల రాములు, కావలి బాలస్వామి, నల్లబోతుల రవి, ఎన్ గట్టు నాయుడు, తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం : ఎమ్మెల్యే



**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** వనపర్తి పట్టణంలో 8 వ వార్డు శ్రీనివాసపురం చెందిన రేగు బాల స్వామి గుండెపోటుతో మృతి చెందాడు. 8వ వార్డుకు చెందిన స్థానిక కౌన్సిలర్ విభూతి నారాయణ బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ జడ్పిటిసి వెంకటయ్య యాదవ్ , వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, ఉమ్మల రాములు, పోలికల బాలస్వామి, గజ్జల నరసింహ, బొంగిని శివ, పసుల సురేష్, మండ్ల గోపాల్, ఉమ్మల శాంతన్న, డి తిరుపతి, వినయ్, జి రాములు, రేగు శాంతన్న, రేగు సాయిలు, పుట్ట మధు, శశాంక్ సాగర్ లు కలిసి రేగు బాలస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## విత్తనాలఎంపికపై గ్రామాలలో రైతులకు అవగాహన - ఏవో నాగార్జున రెడ్డి





**లింగాల ,మేజర్ న్యూస్:** నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి సాధ్యమని,నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోవద్దని మండల వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, శ్రీరంగాపురం గ్రామాలలో వానకాలం పంటల సాగుకు విత్తనాల ఎంపికపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలపై రైతులు అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని పంట దిగుబడి వచ్చే వరకు రసీదులను భద్రపరుచుకోవాలని రైతులను సూచించారు. విత్తనాల ప్యాకెట్లపై తయారు తేదీ, కాలం ముగిసిన తేదీ తో పాటు బ్యాడ్జి నెంబర్ ,లా నెంబర్ ధర టేబుల్ కలిగి ఉందా సరిగ్గా చూసుకోవాలని అన్నారు. అపరిచితులు నకిలీ విత్తనాలు అమ్మేందుకు గ్రామాలలోకి వస్తున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని అనుమానం ఉన్న వారిపై వ్యవసాయ పోలీస్ శాఖ వారికి సమాచారం ఇచ్చి నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయ శాఖ వారు ఇచ్చే సూచనలను జాగ్రత్తగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు వెంకటేశ్వర్లు ,శకుంతల గ్రామ విస్తరణ అధికారి మానస తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఐడిఓసిలోని తన ఛాంబర్‌లో మాదక ద్రవ్యాలనిర్మూలనకు నార్కోటెక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల సరఫరా లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ ను విక్రయించకుండా పూర్తి నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై జూన్ చివరి వారంలో ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మత్తు పదార్థాలను ప్రజలు వినియోగించకుండా, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓరామ్ చందర్, డి.ఎస్.పి సత్య నారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, డీ.డబ్ల్యు.ఓ సుధారాణి, ఎఫ్.ఆర్.ఓ దేవరాజు, డి.సి.పి.ఓ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి : ఏ.యస్.ఐ శ్రీదేవి




**మక్తల్ మేజర్ న్యూస్ :** నారాయణపేట జిల్లా యస్.పి యోగేష్ గౌతమ్ ఐ.పి.యస్ ఆదేశాల మేరకు షి టీమ్ ఇంచార్జి ఏ.యస్.ఐ శ్రీ దేవీ ఆధ్వర్యంలో మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా హరాస్మెంట్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్స్, గృహ హింస, షీ టీమ్స్, భరోసా సెంటర్, బాల్య వివాహలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఏ.యస్.ఐ శ్రీ దేవీ మాట్లాడుతూ... ముఖ్యంగా మహిళలపై చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యుక్తవయసులో ఉన్న తమ పిల్లల రోజు రోజు కార్యకలాపాలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని, బాల్యవివాహలకు ప్రోత్సహించే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకొనబడతాయని అమ్మాయిలకు బాల్య వివాహాలు చేయరాదని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అందరు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే 1930 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. నారాయణపేట జిల్లా పరిధిలో మహిళల, విద్యార్థుల రక్షణ మరియు భద్రత కొరకు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని ఏలాంటి ఆపద సమయం లోనైనా షీ టీమ్ నంబర్ 8712670398 కి పిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. మంచిగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పోలీసు శాఖ తరపునే కాకుండా ఇతర శాఖల ఆధ్వర్యంలో కూడా ఇకపై నిత్యం ఇలాంటి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఆపదలో ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్స్ 1930,108,100,112 లకు ఫోన్ చేసి పోలీసు మరియు ఇతర శాఖల యంత్రాంగం యొక్క సేవలు పొందాలని కోరారు. ప్రతి ఒక్కరూ కూడా మహిళలపై, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షి టీమ్ పోలీసులు శ్రీ దేవి, బాల్ రాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రైవేట్ ఉపాధ్యాయుడు మృతి : కౌకుంట్లలో విషాదం, శోకసంద్రంలో విద్యార్థులు



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** ఆయన ఒక ప్రైవేట్ ఆంగ్ల ఉపాధ్యాయుడు, కానీ అందరి మన్ననలను పొందాడు. విద్య నేర్పడంలో ఆయనకు ఆయనే సాటి. నిరుపేద విద్యార్థులకు తన వంతు సహాయం చేసేవారు, కానీ విధి ఆయనను చూసి ఓర్వలేకపోయింది. గుండెపోటు రూపంలో ఆయనను మృత్యు పొట్టాను పెట్టుకుంది. కౌకుంట్లలో బుధవారం తెల్లవారుజామున ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కౌకుంట్లలో గుండెపోటుతో రాచాల నాగరాజు అనే ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు మృతి చెందారు. చిన్నప్పటినుండి గ్రామంలో నాగరాజు కష్టపడి చదువుకుని అందరితో కలిసి మెలిసి ఉండేవారు. విద్య అంటే ఆయనకు ఎనలేని ప్రేమ. ఇంతవరకు దేవరకద్ర లోని సి.వి. రామన్, శ్రీవాణి శిశు మందిర్, వెంకటసాయి, పాఠశాలలో ఆయన పనిచేశారు. ప్రస్తుతం దోకూర్ తపోవన్ ప్రైవేట్ పాఠశాలలో ఆయన ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో ఆయన కృషి చేస్తుండేవారు. కానీ ఆ కోరిక తీరక ముందు ఆయన పరలోకానికి పయనమయ్యారు. వేసవి సెలవులు ఉన్నందున రెండు రోజుల క్రితం హైదరాబాదులోని తన బంధువుల వద్దకు వెళ్లారు. అక్కడ అకస్మాత్తుగా ఆయనకు గుండెపోటు రావడంతో నాగరాజు మృతి చెందారు. దీంతో కౌకుంట్లలో విషాదం అలుముకుంది. జరిగిన సంఘటనను గ్రామస్తులు, సాటి పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, జరిగిన సంఘటనను జీర్ణించుకోలేక పోతున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నిరుగా విలపిస్తున్నారు. ఉపాధ్యాయుడు నాగరాజు వద్ద విద్య నేర్చుకున్న విద్యార్థులు శోకసంద్రంలో మునిగి పోయారు. వారి రోదనలు ఉపాధ్యాయుడు నాగరాజు ఇంటి వద్ద మిన్నంటాయి. మృతుడు నాగరాజుకు భార్య, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. నాగరాజు పార్థివదేహాన్ని బుధవారం సాయంత్రం కౌకుంట్లకు తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు జరగనున్నాయి.

# ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పై సొంత గ్రామస్తుల ఫిర్యాదు

## - అక్రమంగా మట్టి తరలించారని జిల్లా కలెక్టర్ రవి నాయక్ కు ఫిర్యాదు





**రాజాపూర్, మేజర్ న్యూస్ :** జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, అతని సోదరుడు దుష్యంత్ రెడ్డి రంగారెడ్డిగూడ గ్రామ శివారులోని భూమి సర్వే నెం. 87, 89, 90, 91 లలో గుర్రాల కోసం అక్రమంగా మూడు మీటర్ల మట్టి నింపడం జరిగిందని ఈ విషయమై బుధవారం రంగారెడ్డి గూడ గ్రామానికి చెందిన పసులాది ప్రశాంత్ రెడ్డి, కర్ణేకోట శ్రీనివాస్, రెబ్రమేని శ్రీనివాస్, ఎరుకలి యాదగిరి తదితరులు జిల్లా కలెక్టర్ రవి నాయక్ కు ఫిర్యాదు చేశారు. ఇట్టి మట్టిని రంగారెడ్డిగూడ శివారులోని సర్వే నెం.361, 362 నుండి ఇష్టా రీతిగా ఇల్లీగల్ మైనింగ్ చేసి నాలుగు నుంచి ఐదు మీటర్ల గుంతలు పెట్టి దాదాపు 15 వేల ట్రిప్పుల మట్టిని తరలించి వారు స్వంత అవసరాలకు వారి ఇంటి వెనుకల పోసుకున్నారని కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి మైనింగ్ అధికారులను ఆదేశించి ఇట్టి ఇల్లీగల్ మైనింగ్ పై పూర్తిస్థాయిలో విచారణచేసి మైనింగ్ చట్టం ప్రకారం పెనాల్టీ విధించి ప్రభుత్వానికి చెల్లించే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ కు వారు విజ్ఞప్తి చేశారు. సర్వే నెం. 87, 89 లలో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఇల్లీగల్ గా షెడ్లు ఏర్పాటుచేసి నేటి వరకు గ్రామపంచాయతీకి టాక్స్ కూడా చెల్లించడం లేదని, బాలానగర్ గ్రామంలో ఇల్లీగల్ గా మట్టినింపారని మైనింగ్ అధికారులు ఫైన్ వేసిన విధంగా ఈ భూమికి కూడా విచారణ చేసి చర్య తీసుకొనగలరని వారు కలెక్టర్ కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇల్లీగల్ మైనింగ్ జరగకుండా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి గూడ గ్రామానికి చెందిన పసులాది ప్రశాంత్ రెడ్డి, కర్ణేకోట శ్రీనివాస్, రెబ్రమేని శ్రీనివాస్, ఎరుకలి యాదగిరి తదితరులు జిల్లా కలెక్టర్ రవి నాయక్ కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను పరిశీలించిన డిఆర్‌డిఓ ఓబులేష్

### - మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారు : కొల్లాపూర్ డిఆర్‌డిఓ





**పెంట్లవెల్లి, మేజర్ న్యూస్:** కొల్లాపూర్ నియోజక వర్గంలోని పెంట్లవెల్లి మండల కేంద్రంలో వెలుగు మహిళా సంఘల సిబ్బందికి,ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు మిషన్ల కేంద్రాలను బుధవారం కొల్లాపూర్ డిఆర్డిఓ ఓబులేష్ పెంట్లవెల్లి ఎంపీడీవో ప్రసన్న కుమారి లు పరిశీలించారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ ఓబులేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని ఆయన అన్నారు. నేడు మన దేశం మొత్తంలో చూసుకుంటే మహిళలు పైలట్లుగా వెళ్లి విమానాలు నడుపుతున్నారని అంతే కాకుండా ప్రతిరంగంలో పురుషులతో సమానంగా వాళ్ళు దూసుకు వెళ్తున్నారని నేడు మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రంలో పాఠశాలల కు సంబంధించిన విద్యార్థుల వస్త్రాలను మహిళా సంఘాల మహిళలు ఒక డ్రెస్ కు 50 రూపాయల చొప్పున మిషన్లపై కుడుతూ తయారు చేస్తుంటే చాలా సంతోషంగా ఉందని ఆయన మహిళ సంఘాల సభ్యులను, వెలుగు ఆఫీస్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి ఎంపీడీవో ప్రసన్న కుమారి , ఎంపీవో మనోహర్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

### - మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు బి.ఆర్.ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవ సన్నాహాక సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ 14ఏండ్ల ఉద్యమ సమయంలో ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రం సాధించి కె.సి.ఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారని ఆయన అన్నారు. మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, కురుమూర్తి యాదవ్ , పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ , నాయకులు, పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

నాగర్‌కర్నూల్ జిల్లా : నాగర్‌కర్నూల్ టౌన్, అచ్చంపేట, టౌన్, రూరల్, బల్మూర్, అమ్రాబాద్, మన్ననూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, తాడూరు, పదర, ఉప్పునుంతల

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు

9059897456,
9440126456

## లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయండి

### - జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్



**నవాబ్ పేట మేజర్ న్యూస్..** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ అన్నారు.విత్తన ప్యాకెట్లపై లాట్ నెంబర్ చూసుకోవాలి అని తెలిపారు.బుదవారం మండల కేంద్రము లోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో 180000 పత్తి విత్తనాలు ప్యాకెట్లు అవసరం ఉండగా ప్రస్తుతం 154354 విత్తనాలు ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి అని అన్నారు.రైతులు తలకరి వర్షానికి 6 సెంటిమీటర్ల వర్షపాతం కంటే ఎక్కువ నమోదైతేనే విత్తనాలు విత్తుకోవాలి అని సూచించారు. ధళారులను నమ్మవద్దని రాత్రి సమయంలో ఊర్లో వచ్చి నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణ కిషోర్ ఫర్టిలైజర్ డీలర్ రఘు రైతులు తదితరులు ఉన్నారు.

## ప్రణాళికతో ఇష్టంగా చదివి విజయం సాధించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



**గద్వాల ప్రతినిధి, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికతో ఇష్టంగా చదివి విజయం సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అపూర్వ చౌహాన్ అన్నారు. బుధవారం ఐడిఓసి లోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 60 మంది అభ్యర్థులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన మెటీరియల్ లోని అంశాలను కూడా క్షుణ్ణంగా చదివి ప్రిలిమ్స్ పరీక్షను అభ్యర్థులు మంచిగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని శ్వేతా ప్రియదర్శిని, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, పాల్గొన్నారు.

## పాఠశాలలకు కావాల్సిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలి - అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** పాఠశాలలకు కావలసిన మంచినీటి సౌకర్యం విద్యుత్, మరుగుదొడ్లు, నల్లబల్లాల కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నాగర్కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్ పరిశీలించారు. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, సిపిఎస్, పి ఎస్ హెచ్ సి,మరియు పిఎస్ ఉర్దూ మీడియం పాఠశాల లకు కావలసిన కనీస వసతులను పరిశీలించారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఇంజనీర్ల తో మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం దృష్టిలో ఉంచుకొని పాఠశాలలకు కావలసిన సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ ఎంపీడీవో బి శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ ఎం సంపత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, వకుళ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు శెట్టి, తుడుకుర్తి గ్రామపంచాయతీ సెక్రటరీ రవీందర్ పాల్గొన్నారు.